navajyothidaily.com

# నవజ్యోతి

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | బుధవారం, 26 ఆగస్టు 2026 | ఎడిటర్ : మన్నె లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 305 | పేజీలు : 8 | వెల : 5/-

## రెబల్ ఎంపీలకు సుప్రీం నోటీసులు

- 20 మంది ఎంపీలకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం
- అనర్హత పిటిషన్లపై విచారణ వేగవంతం చేయాలన్న టీఎంసీ
- కేవలం నోటీసులు సరిపోవని కోర్టు వ్యాఖ్య
- విలీనం చెల్లుబాటుపై రెబల్ వర్గం వాదన

2లో



## భారత్ పర్యటనకు షీ జిన్‌పింగ్?

- బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశాలు
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టనున్న చైనా అధ్యక్షుడు
- బీజింగ్‌లో అజిత్ డోవల్ కీలక పర్యటన
- సరిహద్దు అంశాలపై ప్రత్యేక ప్రతినిధుల సమావేశం



3లో

# మూసీ భూసేకరణకు వేగం పెంచాలి: రేవంత్

- ల్యాండ్ పూలింగ్ విధానానికి రూపకల్పన
- ఫేజ్-2 పనులకు త్వరలో టెండర్లు
- పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాజెక్టులపై దృష్టి
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. భూసేకరణ విషయంలో సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణలో ల్యాండ్ పూలింగ్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రిసూచించారు. రైతులు, భూ యజమానుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి చట్టబద్ధమైన మార్గదర్శకాలను రూపొందించి భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

(తరువాయి 2లో)

### 22ఏ బాధితుల ఆవేదనపై

# హరీశ్ రావు ధ్వజం

- ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శ
- మంత్రి పొంగులేటి లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు
- 22ఏ జాబితా నుంచి భూములు తొలగించాలని డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల సమస్యపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి పాల్గొన్న ఆయన, ప్రభుత్వ విధానాల వల్ల వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

(తరువాయి 3లో)



# త్వరలో ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం ప్రారంభం

- పేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు
- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు
- ఆన్‌లైన్ దరఖాస్తులకు సెప్టెంబర్ 15 వరకు గడువు
- అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచన

**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** పేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం "ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం"ను ప్రారంభించింది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకానికి 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

(తరువాయి 2లో)



## కాంగ్రెస్ పై బీజేపీ విమర్శలు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్
- పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనల ప్రస్తావన
- యువత సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరింపు
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ప్రశ్నలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** తెలంగాణలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఢిల్లీలో యువజన సంక్షేమం, యువత భవిష్యత్తు, కొత్త తరం అవకాశాలపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతున్నప్పటికీ, తెలంగాణలో విద్యార్థుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా యువత తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం వేలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారని రాంచందర్ రావు తెలిపారు. బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా విద్యార్థులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. విద్య హక్కును పరిరక్షించాల్సిన ప్రభుత్వమే విద్యార్థుల ఆందోళనలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

(తరువాయి 2లో)



## రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది: గవర్నర్

- పసుపు రైతుల ఆదాయం పెంపుపై దృష్టి
- 'సునహరీ మిట్టీ అభియాన్' ప్రారంభం
- సహజ వ్యవసాయం, మార్కెట్ అనుసంధానానికి ప్రోత్సాహం
- నిజామాబాద్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు

2లో



## జపాన్ పెట్టుబడులకు తెలంగాణ ఆహ్వానం

- పెట్టుబడులకు అన్ని విధాల సహకారం
- తెలంగాణ యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు
- నైపుణ్య మానవ వనరులపై భాగస్వామ్యం
- ఒసాకాలో ఇండియా-జపాన్ రౌండ్‌టేబుల్ సమావేశం

2లో



## రూ.1.25 కోట్ల గంజాయి స్వాధీనం

- అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు
- 251 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసులు
- నాలుగు రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు వెల్లడి
- మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపిన పోలీసులు

2లో

## ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పనకు సీఎం ఆదేశాలు

- గోదావరి పుష్కరాలకు ఘన ఏర్పాట్లు
- రూ.4,026 కోట్లతో 4,932 అభివృద్ధి పనుల పురోగతి సమీక్ష భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని సూచన
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



2లో



## టిమ్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహణ
- వైద్య సేవల విస్తరణపై చర్చ
- సంస్థ అభివృద్ధికి కార్యాచరణపై సమీక్ష

2లో

## బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్

- బీపీ మండల్ జయంతి సందర్భంగా నివాళులు
- గన్‌పార్క్ వద్ద బీసీ నాయకుల సమావేశం
- కులగణన లేక రిజర్వేషన్లకు ఇబ్బందులని వ్యాఖ్య
- కేంద్రంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి పిలుపు

3లో




## డిసెంబర్‌లో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు

- ఎస్ఐఆర్ పూర్తయ్యాక ఎన్నికల ప్రక్రియకు అవకాశం
- ఐదు కార్పొరేషన్లపై ప్రత్యేక దృష్టి
- పెండింగ్ మున్సిపాలిటీలకూ ఎన్నికల నిర్వహణ యోచన

3లో

## స్థానిక ఎన్నికలపై జగన్ దిశానిర్దేశం

- స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ప్రజా తీర్పు స్పష్టమని వ్యాఖ్య
- బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని సూచన
- కేడర్ బలోపేతానికి గుర్తింపు కార్డుల పంపిణీ
- లీగల్, మీడియా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని పిలుపు

3లో



నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com

# రూ.1.25 కోట్ల గంజాయి స్వాధీనం

- అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు
- 251 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసులు
- నాలుగు రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు వెల్లడి
- మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపిన పోలీసులు

**హనుమకొండ, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దామెర పోలీసులు భారీ గంజాయి రవాణా ముఠాను ఛేదించారు. అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఓ నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక ద్విచక్ర వాహనం, రూ.9,000 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పర్యవేక్షణలో దామెర పోలీసులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ముదిగొండ నాగేశ్వర్ రావు (55), పులుకుర్తి గ్రామం, దామెర మండలానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు అంతర్‌రాష్ట్ర స్థాయిలో గంజాయి కొనుగోలు, విక్రయాలకు పాల్పడుతున్నట్లు కీలక వివరాలు బయటపడ్డాయి. ప్రాథమిక విచారణలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తుల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యక్తుల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యాపారాన్ని కొనసాగించినట్లు వెల్లడైంది. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా అతని నివాసంలో సోదాలు నిర్వహించిన పోలీసులు 251 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల మార్కెట్ విలువ సుమారు రూ.1.25 కోట్లుగా అంచనా వేశారు. ఈ కేసు రాష్ట్రాల మధ్య విస్తరించిన అక్రమ మత్తు పదార్థాల నెట్‌వర్క్‌ను వెలుగులోకి తెచ్చిందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఇతర నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి కొనుగోలు చేసినట్లు గుర్తించిన ఇతర రాష్ట్రాల వ్యక్తుల వివరాలను సేకరిస్తూ దర్యాప్తును మరింత విస్తరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై తెలంగాణ పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను కమిషనర్ అభినందించారు.

# రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది: గవర్నర్

**నిజామాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** రైతుల సంక్షేమమే దేశాభివృద్ధికి బలమైన పునాదని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో పసుపు రైతులను ఉద్దేశించి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పసుపు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయం, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రాసెసింగ్ యూనిట్లు, బలమైన మార్కెట్ అనుసంధానం అవసరమని గవర్నర్ పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులు అందించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా 'సునహరీ మిట్టీ అభియాన్'తో పాటు మార్కెట్ లింకేజ్ కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం, అవశేషాలు లేని పసుపు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను గవర్నర్ సన్మానించారు. రైతులు సంఘటితంగా పనిచేస్తే మార్కెట్ అవకాశాలను మరింత సమర్థంగా వినియోగించుకోవచ్చని చెప్పారు. భారతీయ పసుపుకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని, దాని మార్కెట్ విస్తరణకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో భారత పసుపు మరింత ప్రాధాన్యం పొందుతుందని పేర్కొన్నారు. "అన్నదాత సుఖీభవ" అనే లక్ష్యంతో రైతులు అభివృద్ధి చెందేలా, నేల ఆరోగ్యం పరిరక్షించబడేలా, భారతీయ పసుపు ప్రపంచ మార్కెట్లో మరింత ఉన్నత స్థాయికి చేరేలా అందరూ కలిసి పనిచేయాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

# జపాన్ పెట్టుబడులకు తెలంగాణ ఆహ్వానం

**ఒసాకా, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ కంపెనీలు ముందుకు రావాలని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు. జపాన్ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెడితే ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, పెట్టుబడులు సురక్షితంగా, లాభదాయకంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా వేగంగా ఎదుగుతోందన్నారు. జపాన్‌లోని ఒసాకాలో నిర్వహించిన 'లెవరేజింగ్ ఇండియన్ టాలెంట్' ఇండియా–జపాన్ వర్క్‌ఫోర్స్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జపాన్ పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు, విద్యా సంస్థల ప్రతినిధులతో తెలంగాణలో పెట్టుబడులు, నైపుణ్య మానవ వనరులు, ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో ఐటీ, ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రపంచ స్థాయి ప్రతిభ అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 600 ఎకరాల్లో కొత్త పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు జపాన్ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. ఇది తెలంగాణపై జపాన్ పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. పెట్టుబడులతో పాటు తెలంగాణ యువతకు జపాన్‌లో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలు, భాషా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబర్ 2026లో నిర్వహించనున్న 'రైజింగ్ తెలంగాణ' సదస్సుకు జపాన్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు హాజరుకావాలని శక్తి శాఖ కార్యదర్శి హరిచందన ఆహ్వానించారు. తెలంగాణ యువతకు సురక్షితమైన విదేశీ ఉపాధి అవకాశాల కల్పనలో టామ్‌కామ్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. భారత్–జపాన్ సంబంధాల బలోపేతంలో వర్క్‌ఫోర్స్ మొబిలిటీ కీలకమని ఒసాకా–కోబే భారత కాన్సుల్ జనరల్ చంద్రు అప్పర్ పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో జపాన్‌కు భారీ స్థాయిలో నైపుణ్య మానవ వనరుల అవసరం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జపాన్ పరిశ్రమల ప్రతినిధులు, భారత–జపాన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెబల్ ఎంపీలకు సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ లోక్‌సభ సభ్యులపై దాఖలైన అనర్హత పిటిషన్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక చర్యలు చేపట్టింది. ఈ ఎంపీలకు మంగళవారం నోటీసులు జారీ చేస్తూ వారి వాదనలు వినిపించాలని ఆదేశించింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవాలంటూ టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. టీఎంసీ తరపున సమర్పించిన పిటిషన్‌లో, రెబల్ ఎంపీలపై అనర్హత పిటిషన్లు లోక్‌సభ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటిపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కోర్టును కోరారు.

లోక్‌సభ స్పీకర్ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇప్పటికే నోటీసులు జారీ చేశారని ధర్మాసనానికి వివరించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, కేవలం నోటీసులు జారీ చేయడం మాత్రమే సరిపోదని, నిర్దిష్ట కాలపరిమితిలోగా విచారణ పూర్తి కావడం కూడా అవసరమని స్పష్టం చేసింది. పెండింగ్ అంశాలను నిరవధికంగా కొనసాగించరాదని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా స్పీకర్‌కు కూడా నోటీసులు జారీ చేయాలనే అభిప్రాయాన్ని ధర్మాసనం తొలుత వ్యక్తం చేసింది. అయితే స్పీకర్ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారని, ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందని సొలిసిటర్ జనరల్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. అనంతరం రెబల్ ఎంపీలకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణకు కేసును వాయిదా వేసింది.

ఇటీవల టీఎంసీకి చెందిన 20 మంది లోక్‌సభ సభ్యులు త్రిపురకు చెందిన నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యామని ప్రకటించారు. అనంతరం వారు జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో చేరారు. ఈ పరిణామం తర్వాత పార్లమెంటులో వారిని ప్రత్యేక వర్గంగా గుర్తిస్తూ వ్యవహరిస్తున్నారు. అయితే టీఎంసీ గుర్తుపై ఎన్నికైన సభ్యులు మరో పార్టీలో చేరడం ద్వారా స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, అందువల్ల ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని టీఎంసీ వాదిస్తోంది. మరోవైపు తమది చట్టబద్ధమైన విలీన ప్రక్రియేనని, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకున్నామని రెబల్ ఎంపీల వర్గం చెబుతోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణ రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# టిమ్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం




**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (టిమ్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో జరిగిన ఈ సమావేశంలో సంస్థ అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, పరిపాలనా అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. సంస్థ భవిష్యత్ కార్యాచరణ, సేవల మెరుగుదలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అలాగే వైద్య విద్యా సంచాలకురాలు డాక్టర్ వాణి, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో వైద్య సేవల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. టిమ్స్ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సిబ్బంది అవసరాలు, రోగులకు మెరుగైన సేవలు అందించే అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులు సూచనలు చేశారు. వైద్య విద్య, పరిశోధన, ప్రత్యేక వైద్య విభాగాల అభివృద్ధికి సంబంధించిన అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా టిమ్స్ సంస్థలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రజారోగ్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో పేర్కొన్నారు. టిమ్స్ సంస్థలను వైద్య రంగంలో ఆదర్శవంతమైన సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులు నిర్ణయించారు.

## ప్రపంచస్థాయి సౌకర్యాల

# కల్పనకు సీఎం ఆదేశాలు

- గోదావరి పుష్కరాలకు ఘన ఏర్పాట్లు
- రూ.4,026 కోట్లతో 4,932 అభివృద్ధి పనుల పురోగతి సమీక్ష
- భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని సూచన
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**అమరావతి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సమాచార సాంకేతిక సేవలను సమగ్రంగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రతిష్ఠకు తగిన రీతిలో నిర్వహించాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడంతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా పుష్కరాలు వేదిక కావాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని చంద్రబాబు సూచించారు. ఘాట్‌ల నిర్వహణ, పరిశుభ్రత, సందర్శకులకు మార్గనిర్దేశం, సేవా కార్యక్రమాల్లో స్థానిక యువత, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని పెంచాలని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో పుష్కరాలను మరింత విజయవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు. పుష్కరాలకు సంబంధించి రూ.4,026 కోట్ల వ్యయంతో చేపట్టిన 4,932 అభివృద్ధి పనుల పురోగతిని సీఎం సచివాలయంలో సమీక్షించారు. రహదారులు, ఘాట్‌ల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య వ్యవస్థలు, విద్యుత్, వసతి కేంద్రాలు, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. భద్రతా ఏర్పాట్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. భారీ జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా వైద్య బృందాలు, సహాయక కేంద్రాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న పనులపై సీఎం వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించి, భక్తులకు అత్యుత్తమ సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

## త్వరలో ఇంటింటికి ఇందిరమ్మ

# కుట్టు మిషన్ పథకం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)



దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరించబడతాయి. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీజీఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాల వారీగా దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హుల ఎంపిక చేపట్టనున్నారు. ఈ పథకానికి దరఖాస్తుల స్వీకరణకు 2026 సెప్టెంబర్ 15ను చివరి తేదీగా నిర్ణయించారు. గడువు ముగిసేలోపు అర్హులైన మహిళలు దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. పథకానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం సంబంధిత జిల్లా బీసీ సంక్షేమ అధికారి లేదా బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయాలను సంప్రదించాలని ప్రభుత్వం వెల్లడించింది. మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పథకం దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మూసీ భూసేకరణకు వేగం పెంచాలి: రేవంత్

(మొదటి పేజీ తరువాయి)




మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు రెండో దశ పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, నది సుందరీకరణ లక్ష్యాలతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రెండో దశ పనులు ప్రారంభమైతే మూసీ పరివాహక ప్రాంతాల అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందని అధికారులు సమావేశంలో వివరించారు. మూసీ రివర్‌ఫ్రంట్ పరిధిలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. తక్కువ వడ్డీ రుణాలను పొందేందుకు మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే అభివృద్ధి పనుల కోసం టీడీఆర్‌ల జారీ ప్రక్రియను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ ప్రతి వారం పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో పారదర్శకత, వేగం రెండూ సమానంగా ఉండాలని పేర్కొన్నారు. గండిపేట మంచిరేవుల సమీపంలో నిర్మించనున్న ఓంకారేశ్వరస్వామి ఆలయానికి వెంటనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. అదే విధంగా కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌ను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమం హైదరాబాద్ నగర భవిష్యత్తును మార్చే కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నది పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, నగర సుందరీకరణ, పర్యాటకాభివృద్ధి లక్ష్యాలను ఒకే వేదికపై సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

# కాంగ్రెస్ పై బీజేపీ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)



పాలిటెక్నిక్ విద్యార్థులు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యా సదుపాయాలు, మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థుల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సమస్యల వల్ల కూడా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ ఆరోపించింది. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పథకాల అమలులో లోపాలు కనిపిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశాలపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించి తక్షణ పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేసింది.

యువత అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేదని రాంచందర్ రావు వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడంలో విఫలమవుతోందని ఆరోపించారు. సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల యువతలో అసంతృప్తి మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని బీజేపీ డిమాండ్ చేసింది. విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## 22ఏ బాధితుల ఆవేదనపై

# హరీశ్ రావు ధ్వజం



- ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శ
- మంత్రి పొంగులేటి లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు
- 22ఏ జాబితా నుంచి భూములు తొలగించాలని డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల సమస్యపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి పాల్గొన్న ఆయన, ప్రభుత్వ విధానాల వల్ల వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి వారిని కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి నెట్టివేశారని అన్నారు. సమావేశంలో మాట్లాడిన హరీశ్ రావు, వందలాది కాలనీల ప్రతినిధులు, వేలాది మంది బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలనే ఆశతో సమావేశానికి హాజరయ్యారని తెలిపారు. భూములను 22ఏ జాబితాలో చేర్చింది ప్రభుత్వమే అయితే, వాటిని తొలగించుకోవడానికి ప్రజలు దరఖాస్తులు చేసుకుంటూ తిరగడం ఎందుకని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకుని, తర్వాత బాధ్యతను వారి మీద మోపడం సరికాదని వ్యాఖ్యానించారు.

లక్షలాది మంది ఆస్తులను ఒకే నిర్ణయంతో నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. భూములపై హక్కులు ఉన్నప్పటికీ వాటిని విక్రయించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ఆస్తుల విలువలు తగ్గిపోయి, అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం పొందలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కూడా హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. భూములను 22ఏ జాబితాలో చేర్చడం వెనుక కమిషన్ల రాజకీయాలు ఉన్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రజల జీవితాలు అస్తవ్యస్తమవుతున్నాయని, దీనికి బాధ్యత వహించాల్సింది అధికార యంత్రాంగమేనని అన్నారు. 22ఏ జాబితాలో భూములు ఉండటంతో అనేక కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటున్నాయని ఆయన పేర్కొన్నారు. పిల్లల పెళ్లిళ్లు జరపడానికి, వైద్య అవసరాల కోసం రుణాలు పొందడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బ్యాంకులు సైతం ఆస్తులను తాకట్టు స్వీకరించకపోవడంతో బాధితులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రజలతో మళ్లీ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వమే సమగ్ర సమీక్ష నిర్వహించి అర్హుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. ప్రజల ఆస్తి హక్కులను కాపాడడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే బాధితుల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## స్థానిక ఎన్నికలపై

# జగన్ దిశానిర్దేశం

- స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ప్రజా తీర్పు స్పష్టమని వ్యాఖ్య
- బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని సూచన
- కేడర్ బలోపేతానికి గుర్తింపు కార్డుల పంపిణీ
- లీగల్, మీడియా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని పిలుపు



**తాడేపల్లి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన రానున్న స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక సూచనలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయం అని జగన్ పేర్కొన్నారు. గత ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, ఈసారి ప్రతి స్థానంలోనూ బలమైన, సమర్థులైన అభ్యర్థులను నిలబెట్టాలని నాయకులకు సూచించారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకూడదని జగన్ స్పష్టం చేశారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను కూడా ఎన్నికల బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపునిచ్చారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి సమన్వయకర్తల పనితీరును పార్టీ పరిశీలిస్తుందని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని తెలిపారు. సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి వాటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ స్థాయిలో పార్టీ ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు.

కార్యకర్తలకు న్యాయపరమైన సహాయం అందించేందుకు నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా విభాగాలను బలోపేతం చేయాలని జగన్ ఆదేశించారు. అవసరమైతే కేసులను ఉన్నత న్యాయస్థానాల వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థను సిద్ధం చేయాలని చెప్పారు. సామాజిక మాధ్యమాలను సమర్థంగా వినియోగించుకోవాలని, డిజిటల్ వేదికల ద్వారా పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే 60 నుంచి 70 రోజుల పాటు నాయకులు తమ నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని జగన్ పిలుపునిచ్చారు.

## భారత్ పర్యటనకు షీ జిన్‌పింగ్?

- బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశాలు
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టనున్న చైనా అధ్యక్షుడు
- బీజింగ్‌లో అజిత్ డోవల్ కీలక పర్యటన

**న్యూఢిల్లీ, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ త్వరలో భారత్‌లో పర్యటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబరు 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నట్లు దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పర్యటన అధికారికంగా ఖరారైతే, దాదాపు ఏడేళ్ల తర్వాత షీ జిన్‌పింగ్ భారత గడ్డపై అడుగుపెట్టినట్లవుతుంది. షీ జిన్‌పింగ్‌తో పాటు చైనాకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కూడా భారత్‌కు వచ్చే అవకాశమున్నట్లు సమాచారం. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, వ్యూహాత్మక సహకార అంశాలపై ఈ సదస్సులో విస్తృత చర్చలు జరిగే అవకాశం ఉంది. ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఇదే సమయంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్ సోమవారం బీజింగ్ చేరుకున్నారు. రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఆయన చైనా ప్రతినిధులతో పలు కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. భారత్–చైనా సంబంధాలు, సరిహద్దు పరిస్థితులు, భద్రతా అంశాలు ఈ చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు రానున్నాయి. మంగళవారం జరగనున్న ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో అజిత్ డోవల్ పాల్గొననున్నారు. భారత్–చైనా సరిహద్దు వివాదాల పరిష్కారానికి సంబంధించి ఈ సమావేశం కీలకంగా భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న విభేదాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. పర్యటన సందర్భంగా చైనా విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు వాంగ్ యీతో కూడా అజిత్ డోవల్ భేటీ కానున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, పరస్పర సహకార అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. షీ జిన్‌పింగ్ భారత పర్యటనకు ముందు అజిత్ డోవల్ బీజింగ్ పర్యటన చేపట్టడం దౌత్యపరంగా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. సరిహద్దు సమస్యల పరిష్కారం, పరస్పర విశ్వాస వాతావరణం నెలకొల్పడం, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ వంటి అంశాలపై ఇరు దేశాలు ముందడుగు వేస్తాయా అనే అంశంపై అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## డిసెంబర్‌లో రెండో దశ స్థానిక సంస్థల

# ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు

- ఎస్ఐఆర్ పూర్తయ్యాక ఎన్నికల ప్రక్రియకు అవకాశం
- ఐదు కార్పొరేషన్లపై ప్రత్యేక దృష్టి
- పెండింగ్ మున్సిపాలిటీలకూ ఎన్నికల నిర్వహణ యోచన




**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** తెలంగాణలో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలను ఈ ఏడాది డిసెంబర్ నెలలో నిర్వహించే దిశగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార వర్గాల్లో జరుగుతున్న చర్చల ప్రకారం డిసెంబర్‌లో కీలక పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అంశం పరిశీలనలో ఉంది. ఈ దశలో సైబరాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 2026లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

హైదరాబాద్ మహానగర పునర్వ్యవస్థీకరణ తర్వాత ఏర్పాటైన సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లకు ఇప్పటివరకు ప్రజాప్రతినిధుల ఎన్నికలు జరగలేదు. దీంతో ఈ రెండు కొత్త కార్పొరేషన్లకు తొలి ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీలతో పాటు ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది. మరోవైపు వివిధ న్యాయ, పరిపాలనా కారణాలతో ఎన్నికలు జరగని అచ్చంపేట, మందమర్రి, మణుగూరు, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాలిటీలకు కూడా ఇదే విడతలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ మున్సిపాలిటీల ఎన్నికలు ఫిబ్రవరి ఎన్నికల షెడ్యూల్‌లో భాగం కాలేదు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటరు జాబితా సిద్ధం కానుంది. అనంతరం వార్డుల వారీగా ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల ఖరారు, ఎన్నికల సిబ్బంది నియామకం వంటి ప్రక్రియలు వేగవంతం కానున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లపై ఇప్పటికే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో ఎన్నికలు జరిగితే రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలు అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. అధికారిక షెడ్యూల్‌పై ఇంకా స్పష్టత రానప్పటికీ, రాజకీయ పార్టీలు మాత్రం ఇప్పటికే ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నాయి



# బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్

- బీపీ మండల్ జయంతి సందర్భంగా నివాళులు
- గన్‌పార్క్ వద్ద బీసీ నాయకుల సమావేశం
- కులగణన లేక రిజర్వేషన్లకు ఇబ్బందులని వ్యాఖ్య
- కేంద్రంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):** జనగణనలో భాగంగా బీసీ కులగణనను తప్పనిసరిగా నిర్వహించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు, మండల్ కమిషన్ మాజీ అధ్యక్షుడు బీపీ మండల్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, దేశంలో బడుగు బలహీన వర్గాలు విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబడి ఉన్నాయని అన్నారు.

బ్రిటిష్ పాలన కాలంలో బీసీ వర్గాలకు సంబంధించిన లెక్కలు సేకరించారని, కానీ ప్రస్తుతం కులగణన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. బీసీ వర్గాలకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు లేకపోవడం వల్ల రిజర్వేషన్ల అమలులో న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. బీసీ కులగణన చేపట్టేందుకు అదనపు వ్యయం అవసరం లేదని, ఎస్సీ, ఎస్టీల కుటుంబాల వివరాలు సేకరించే సమయంలోనే బీసీల కుల వివరాలను కూడా నమోదు చేయవచ్చని అభిప్రాయపడ్డారు. దేశంలోని అన్ని బీసీ కులాల జాబితాను రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. బీసీ కులగణన చేస్తామని ప్రకటించి అమలు చేయకపోతే తీవ్ర ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం లభించాలంటే కులగణన కీలకమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు కులగణన అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గుజ్జ కృష్ణ, గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, శ్యామ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com



## ప్రముఖ కవయిత్రి చందుపట్ల
# ప్రమీలా దేవికి ఘన సన్మానం

**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
రవీంద్ర భారతి వేదికగా తెలంగాణ సాహిత్య అకాడమీ, భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ దాశరధి రంగాచార్యులు జయంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి చందుపట్ల ప్రమీలా దేవి ని ఆమె సాహిత్య సేవలను గుర్తించి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సభలో పలువురు ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొని డాక్టర్ దాశరధి రంగాచార్యులు సాహిత్య విశిష్టతను కొనియాడారు. వారి రచనలు సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయని వక్తలు పేర్కొన్నారు.

## నాటిన ప్రతి మొక్కను
# సంరక్షించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

**భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే వన మహోత్సవం లక్ష్యం**



**సంగారెడ్డి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడాన్ని ఒకరోజు కార్యక్రమంగా భావించకుండా, అవి పెద్దవిగా పెరిగే వరకు సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. చెట్లు పెరిగితేనే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో ప్రజలు ఇళ్ల వద్ద, పరిసరాల్లో నాటుకునేందుకు అవసరమైన మొక్కలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, వాటి సంరక్షణను పర్యవేక్షిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జ్యోతి, డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణతో పాటు వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి-బీజేపీ లడాయి : దేశ్‌పాండే

**విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగిస్తాం**



**హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
తెలంగాణలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల విడుదల కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకోగా, మంగళవారం దేశ్‌పాండే దీక్షకు మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్న విద్యార్థులు బకాయిలు విడుదల కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడం వల్ల విద్యార్థుల చదువులు, ఉన్నత విద్యావకాశాలపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల సమస్యల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. "ఫీజు బకాయి –బీజేపీ లడాయి" నినాదంతో విద్యార్థుల తరఫున పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని దేశ్‌పాండే స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం సామాజిక బాధ్యత అని, ఈ పోరాటానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి బకాయిల విడుదలకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించే వరకు విద్యార్థుల పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని తెలిపారు.

# బిజెపి లీగల్ కన్వీనర్ గా బసవరాజ్



**సంగారెడ్డి, ఆగష్టు 25 (నవజ్యోతి ప్రతినిది) :**
బిజెపి లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ గా నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ న్యాయవాది బసవరాజ్ ను జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియమించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు సూచనల మేరకు వివిధ విభాగాలకు కన్వీనర్లను నియమించారు. దీనిలో అతి ముఖ్యమైన లీగల్ సెల్ విభాగానికి సీనియర్ న్యాయవాది బసవరాజును ఎంపిక చేశారు. అందరికీ అందుబాటులో ఉంటూ, బిజెపి బలోపేతం చేయడానికి పాటుపడుతున్నందువల్లనే తనకు ఈ అవకాశం దక్కిందని ఈ సందర్భంగా బసవరాజు పేర్కొన్నారు. తనను ఎంపిక చేసిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం మరింతగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## రేవంత్ అమెరికా పర్యటనను అడ్డుకోవడం
# తెలంగాణను అవమానించడమే

**విద్యారంగ అభివృద్ధి కోసమే సీఎం విదేశీ పర్యటన**

**మోదీ పాకిస్థాన్ పర్యటనపై ముందుగా బీజేపీ నేతలు సమాధానం చెప్పాలి**

**రాహుల్ గాంధీ నాయకత్వంపై రేవంత్‌కు పూర్తి నిబద్ధత ఉంది: జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
తెలంగాణ విద్యారంగ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. సీఎం హోదాలో అధికారిక పర్యటనకు వెళ్తున్న రేవంత్ రెడ్డిని అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ అంశంపై తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, మేధావులు ఆలోచించాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల స్వేచ్ఛ బందీ అయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడే హక్కుతో పాటు తమ సమస్యలు, డిమాండ్లపై ధర్నాలు చేసుకునే స్వేచ్ఛను కల్పించిందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇందిరాపార్క్ వద్ద ప్రజలు తమ డిమాండ్ల కోసం నిరసనలు తెలిపే అవకాశం కల్పించామని చెప్పారు. ప్రజా సంక్షేమంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులకు స్మార్ట్ కార్డులు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు.

**లండన్‌కు అనుమతించి.. అమెరికాకు ఎందుకు అడ్డుకున్నారు?**

సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు బయలుదేరగా కేంద్ర ప్రభుత్వం అనుమతించకుండా లండన్ నుంచే వెనక్కి వచ్చే పరిస్థితి కల్పించిందని జగ్గారెడ్డి ఆరోపించారు. "లండన్‌కు వెళ్లేందుకు అనుమతించిన కేంద్రం.. అమెరికా పర్యటనను ఎందుకు అడ్డుకుంది? తెలంగాణ ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడం వల్లనే ఇలా చేశారా? రేవంత్ పర్యటన విజయవంతం కాకూడదనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరించిందా?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గతంలోనూ అమెరికా వెళ్లారని, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో వెళ్లకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో కేంద్రం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**'మోదీ పాకిస్థాన్ ఎందుకు వెళ్లారో చెప్పాలి'**

దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తిని కలిసేందుకు రేవంత్ రెడ్డి వెళ్తున్నారంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలను జగ్గారెడ్డి తప్పుబట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015లో అప్పటి పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను లాహోర్‌లో కలిసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. "ప్రధానమంత్రికి అత్యంత కట్టుదిట్టమైన భద్రత, ప్రోటోకాల్ ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో మోదీ పాకిస్థాన్‌కు ఎందుకు వెళ్లారు? నవాజ్ షరీఫ్‌ను ఎందుకు కలిశారు? దీనిపై ముందుగా బీజేపీ నేతలు సమాధానం చెప్పాలి. ఆ తర్వాత రేవంత్ రెడ్డి పర్యటన గురించి మాట్లాడాలి" అని జగ్గారెడ్డి అన్నారు. అమెరికా వంటి దేశాలకు ముఖ్యమంత్రి అధికారిక పర్యటనకు వెళ్తే సంబంధిత వ్యవస్థలకు సమాచారం ఉంటుందని, అధికారిక ప్రతినిధుల పర్యవేక్షణ కూడా ఉంటుందని పేర్కొన్నారు. అలాంటప్పుడు రేవంత్ పర్యటనపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు.

**'బీజేపీ వాళ్లు చేస్తే మాత్రం తప్పు కాదా?'**

బీజేపీ నేతలు తాము ఏం చేసినా సరైనదేనన్నట్లు వ్యవహరిస్తూ, ప్రతిపక్ష పార్టీల నేతల విషయంలో మాత్రం భిన్నమైన వైఖరి అవలంబిస్తున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దానిని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

**'రాహుల్ నాయకత్వంపైనే రేవంత్‌కు నిబద్ధత'**



రేవంత్ రెడ్డిపై ప్రధాని మోదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, వాటిని ఎక్కువగా ఊహించుకోవాల్సిన అవసరం లేదని జగ్గారెడ్డి అన్నారు. "ఎవరైనా రేవంత్‌ను అభిమానిస్తే అది వారి ఇష్టం. అవతలి వ్యక్తి ప్రేమిస్తే మనం ఏం చేయగలం? అది వన్‌సైడ్ లవ్ మాత్రమే" అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మాత్రం రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేయాలనే స్పష్టమైన నిబద్ధతతో ఉన్నారని చెప్పారు. రాజకీయంగా ఎలాంటి వ్యాఖ్యలు వచ్చినా రేవంత్ రెడ్డి సమతుల్యంగా వ్యవహరిస్తున్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# లియాఫి సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

**డివిజన్ ఈసీ మెంబర్ ఐలేని రాజేశ్వర్ రెడ్డి • నూతన ప్రతినిధులకు జగిత్యాల బ్రాంచి ఘన సన్మానం**



**జగిత్యాల, ఆగస్టు 25 (నవజ్యోతి జిల్లా బ్యూరో) :**
లియాఫి సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కరీంనగర్ డివిజన్ ఈసీ మెంబర్ ఐలేని రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని బండారి గార్డెన్‌లో జగిత్యాల బ్రాంచి లియాఫి ఆధ్వర్యంలో ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జోనల్ మెంబర్ నల్ల సత్తయ్య, కరీంనగర్ డివిజన్ ఈసీ మెంబర్ ఐలేని రాజేశ్వర్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ పరిధిలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను బ్రాంచి ప్రతినిధుల సహకారంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సభ్యుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణతో పాటు సంస్థ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జోనల్ మెంబర్ నల్ల సత్తయ్య మాట్లాడుతూ సభ్యుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తానన్నారు. సమావేశంలో సంస్థ బలోపేతం, సభ్యుల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు ఏనుగుర్తి వెంకటస్వామి, సెక్రటరీ గుండ నాగరాజు, కోశాధికారి కట్ట నర్సయ్య, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, డివిజన్ ఉపాధ్యక్షులు సత్యం, గుండయ్య, జాయింట్ సెక్రటరీ భూమన్న, ఈసీ సభ్యులు మహేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# షట్టర్ మూసిందంటే..దొంగల కన్ను పడినట్టే!

**చింతల్ చోరీతో గుట్టురట్టైన అంతర్రాష్ట్ర ముఠా!**

**13 చోరీలు..ఏడు స్టేషన్లు..నలుగురు నిందితులు!**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25: (నవజ్యోతి ప్రతినిధి):**
రాత్రివేళల్లో మూసివున్న వాణిజ్య సంస్థలను టార్గెట్‌గా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జీడిమెట్ల పోలీసులు, సైబరాబాద్ ప్రత్యేక బృందాలు అరెస్ట్ చేశాయి. మొత్తం 13 చోరీ కేసులను ఛేదించినట్లు కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్.కోటి రెడ్డి వెల్లడించారు.

**చింతల్ చోరీతో ముఠా గుట్టురట్టు**

ఆగస్టు 5/6వ తేదీ రాత్రి చింతల్ మెయిన్‌రోడ్, గణేష్‌నగర్‌లోని అయినాథ్ గ్లాస్ అండ్ ప్లైవుడ్ షాపు షట్టర్‌ను పైకి లేపి లోపలికి ప్రవేశించిన దుండగులు కౌంటర్‌లోని రూ.80 వేల నగదును అపహరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక, ఎలక్ట్రానిక్ ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు రాజస్థాన్, గుజరాత్ వైపు పారిపోయినట్లు గుర్తించి ప్రత్యేక బృందాలను అక్కడికి పంపించారు.

**రాష్ట్రాలు దాటినా..వేట ఆగలేదు**

రాజస్థాన్‌లోని బేవార్ జిల్లాలో హరి సింగ్ (30), చందన్ సింగ్ (28)ను, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో లుంబ్ సింగ్ (29), మనోహర్ సింగ్ (20)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్సిట్ వారెంట్ల అనంతరం వారిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి దర్యాప్తు కొనసాగించారు.

**పగలు రెక్కీ..రాత్రి చోరీ**

ముఠా సభ్యులు ముందుగా మూసివేసే దుకాణాలను గుర్తించి, రాత్రివేళల్లో షట్టర్లు పైకి లేపడం లేదా పగులగొట్టి లోపలికి ప్రవేశించేవారు. కొందరు లోపల చోరీ చేస్తే.. మరికొందరు బయట కాపలా కాసేవారు. గండిమైసమ్మ, చింతల్, జీడిమెట్ల, నిజాంపేట్, దూలపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లోని పలు దుకాణాలను లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.




**ఏడు పోలీస్ స్టేషన్ల పరిధిలో 13 కేసులు**

బాచుపల్లి--3, దుండిగల్--2, జీడిమెట్ల--2, పేట్ బషీరాబాద్--3, మియాపూర్--1, కేపీహెచ్‌బీ--1, మేడ్చల్--1 చొప్పున కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో కూకట్‌పల్లి సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, దుండిగల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.రమేష్ నాయుడు, వారి బృందాలు కీలకంగా పనిచేశాయి. ప్రత్యేక ఆపరేషన్ విజయవంతం చేసిన పోలీసు సిబ్బందిని డీసీపీ కోటి రెడ్డి అభినందించారు.

**వ్యాపారులకు పోలీసుల సూచనలు**

వాణిజ్య సంస్థల వద్ద పనిచేసే సిసి టీవీ కెమెరాలు, పటిష్టమైన షట్టర్లు, తాళాలు, తగినంత లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. రాత్రివేళ దుకాణాల్లో పెద్ద మొత్తంలో నగదు ఉంచవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# పచ్చని పర్యావరణం భావితరాలకు అందించాలి

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**

**సంగారెడ్డి 33వ వార్డులో ఘనంగా వనమహోత్సవం**



**సంగారెడ్డి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భావితరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిం చాలని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని 33వ వార్డులో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యత, సకాలంలో వర్షాలు, స్వచ్ఛమైన గాలి కోసం పచ్చదనం పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు. మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తయిందని భావించకుండా వాటిని సంరక్షించి వృక్షాలుగా ఎదిగే వరకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత, స్థానిక ప్రజలు మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. సంగారెడ్డి నియోజకవర్గాన్ని పచ్చదనంతో నింపేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పుట్టినరోజులు, వివాహాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని నిర్మలా జగ్గారెడ్డి కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీకాంత్ గౌడ్, వంశీ, సంగీత మహేష్, రమేష్, అశ్విన్, కాంగ్రెస్ నాయకులు శివుడు, గడ్డం రాజు, ప్రవీణ్ తదితరులు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.





## వర్షాలకు దెబ్బతిన్న రహదారి..
# గుంతలతో అవస్థలు

**విజ్ఞాన్ కాలనీలో వాహనదారులకు ఇబ్బందులు**

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసుల విజ్ఞప్తి**

**కంది, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
కంది గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీ హాస్పిటల్ మెయిన్ రోడ్డుకు ఎదురుగా ఉన్న విజ్ఞాన్ కాలనీలో రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు తీవ్రంగా దెబ్బతిని పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షపు నీరు గుంతల్లో నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో వాటి లోతు తెలియక ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, స్థానికులు సైతం రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రహదారి మరింత దెబ్బతినకముందే గ్రామపంచాయతీ అధికారులు స్పందించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్డును పరిశీలించి గుంతలను పూడ్చడంతో పాటు శాశ్వత మరమ్మతులు చేపట్టి సురక్షితమైన రాకపోకలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ, సంతోష్, రాములు, జైపాల్ రెడ్డి, తిరుమల్, జైపాల్ నాయక్, అంజిరెడ్డి, శ్రీనివాస్, సతీష్ తదితర కాలనీవాసులు రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

## పార్కు వేలం నిలిపివేత
# మీడియా ఘనతే



**కూకట్‌పల్లి , ఆగస్టు 25 ( నవజ్యోతి ప్రతినిధి):**
మిత్ర హిల్స్ కాలనీ పార్కు స్థలం వేలంపాటపై న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, ఆరోగ్యం ఎంతో ముఖ్యమని భావించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. పార్కును యథావిధిగా పార్కుగానే కొనసాగించాలని కోర్టు ఆదేశించడం వెనుక పాత్రికేయ మిత్రుల కృషి ఎనలేనిదని ఆయన కొనియాడారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి న్యాయం జరిగేలా సహకరించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బొల్లేపల్లి సీతారామరాజుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చక్కెర చేదెక్కింది..

## విధానాలు మారాల్సిన సమయం ఇదేనా?

**అక్కడే మరో ప్రశ్న.
అక్టోబర్ 31 తర్వాత ఏం జరుగుతుంది? దేశీయ ఉత్పత్తి పెరుగుతుందా? కొత్త చెరుకు సీజన్ నుంచి సరఫరా మెరుగవుతుందా? ధరలు సాధారణ స్థాయికి వస్తాయా? లేక మళ్లీ ఇదే పరిస్థితి ఎదురవుతుందా? తాజా నివేదికల ప్రకారం కొత్త చెరుకు క్రషింగ్ సీజన్ అక్టోబర్ మధ్య నుంచి ప్రారంభమై దేశీయ సరఫరా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల దిగుమతులు శాశ్వత పరిష్కారం కాకుండా పండుగల ముందు సరఫరా ఒత్తిడిని తగ్గించే తాత్కాలిక చర్యగానే చూడాల్సి ఉంటుంది.**




**ఆగస్టు 26 (ఎడిటోరియల్ నోట్):**
ఒకప్పుడు భారత్ చక్కెరను విదేశాలకు ఎగుమతి చేసిన దేశం. ఇప్పుడు దేశీయ మార్కెట్‌లో ధరలు అదుపు తప్పడంతో విదేశాల నుంచి చక్కెర దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి. తెలంగాణలో రిటైల్ మార్కెట్‌లో కిలో చక్కెర రూ.70 నుంచి రూ.75 వరకు పలుకుతోంది. పండుగల సీజన్ ముందే నిత్యావసర వస్తువు ధర ఇలా పెరగడం సామాన్యుడి ఇంటి బడ్జెట్‌పై అదనపు భారంగా మారుతోంది. జూలై 20 నుంచి ఆగస్టు 25 మధ్య దేశ సగటు రిటైల్ చక్కెర ధర కూడా దాదాపు 50 శాతం పెరిగి కిలోకు రూ.48.18 నుంచి రూ.70.70కు చేరింది. దేశీయ సరఫరాపై ఒత్తిడి నేపథ్యంలో కేంద్రం దాదాపు దశాబ్దం తర్వాత 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. ఈ అనుమతి అక్టోబర్ 31 వరకు ఉంది.

**ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది...**
ఎగుమతులు చేసే స్థాయి నుంచి దిగుమతులు చేసుకునే పరిస్థితికి భారత్ ఎందుకు వచ్చింది? పండుగల సమయంలోనే చక్కెర ధరలు ఎందుకు చేదెక్కాయి? ఈ విధానం ఎంతకాలం కొనసాగుతుంది?

**పండుగల వేళే ధరల మంట ఎందుకు?**
మన దేశంలో ఆగస్టు నుంచి నవంబర్ వరకు పండుగల సీజన్. గణేశ్ చతుర్థి, దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో స్వీట్లు, మిఠాయిలు, బేకరీ ఉత్పత్తులు, పానీయాల్లో చక్కెర వినియోగం పెరుగుతుంది. ఈ డిమాండ్ ప్రతి ఏడాది ముందే తెలిసినదే. అయినా పండుగలకు కొద్దిరోజుల ముందు మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పెరగడం ఎందుకు? పరిశ్రమ వర్గాల ప్రకారం దేశంలో పండుగల డిమాండ్‌ను తట్టుకునేంత చక్కెర నిల్వలు ఉన్నాయని చెబుతున్నారు. తాజా ధరల పెరుగుదలలో ఊహాగానాలు, నిల్వలు కూడబెట్టడం వంటి మార్కెట్ అంశాలు కూడా పాత్ర పోషిస్తున్నాయని పరిశ్రమ ప్రతినిధులు చెబుతున్నారు. అదే సమయంలో ఉత్పత్తి తగ్గుదల, ప్రారంభ నిల్వలు తగ్గడం వంటి అంశాలపై ఆందోళన ఉంది. అంటే సమస్య కేవలం "చక్కెర లేదు" అనే స్థాయిలోనే ఉందా? లేక సరఫరా వ్యవస్థ, నిల్వల నిర్వహణ, మార్కెట్ అంచనాల్లో లోపం కూడా ఉందా అన్నది ప్రభుత్వం స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉంది.

**ఎల్‌నినో.. వాతావరణం దెబ్బ కూడా ఉందా?**
చెరుకు పంట వాతావరణ పరిస్థితులకు సున్నితమైనది. ఉష్ణోగ్రతలు, వర్షపాతం, కరువు, అధిక వర్షాలు వంటి మార్పులు దిగుబడిపై ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు వ్యవసాయంపై చూపే ప్రభావాన్ని కూడా విస్మరించలేం. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చూడాలి. ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణమని చెప్పడం సరైంది కాదు. ఉత్పత్తి, వాతావరణం, నిల్వలు, మార్కెట్ పరిస్థితులు, పండుగల డిమాండ్.. ఇవన్నీ కలిసి సరఫరాపై ఒత్తిడి పెంచే అంశాలు. వాతావరణ మార్పులు ఇక వ్యవసాయానికి దూరమైన విషయం కాదు. వర్షం ఎప్పుడు వస్తుందో, ఎంత వస్తుందో, ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయో మారుతున్న కొద్దీ పంటల లెక్కలు కూడా మారుతున్నాయి. దాని ప్రభావం చివరికి రైతు పొలం నుంచి వినియోగదారుడి వంటింటి వరకు చేరుతోంది.

**చెరుకు పండించే రైతు ఎక్కడికి వెళ్లాడు?**
చక్కెర ధరలపై చర్చిస్తున్నప్పుడు చెరుకు రైతును మర్చిపోవడం పెద్ద తప్పు. తెలంగాణలో ఒకప్పుడు నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో చెరుకు విస్తారంగా సాగయ్యేది. కానీ కాలక్రమంలో చక్కెర కర్మాగారాల మూసివేత, పంటకు లభించే ధర, చెల్లింపుల అనిశ్చితి, సాగు ఖర్చులు తదితర కారణాలతో రైతులు చెరుకు నుంచి వరి వైపు మళ్లారు. తెలంగాణలో చెరుకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గినట్లు గత నివేదికలు పేర్కొన్నాయి. ఇది కేవలం ఒక పంట మార్పు కాదు. ఒకప్పుడు చెరుకు పండించిన ప్రాంతాల్లో ఇప్పుడు వరి పండుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వాలు నీటి వినియోగాన్ని తగ్గించేందుకు ఆరుతడి పంటలు, పప్పులు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నాయి. అయితే రైతు అడిగే ప్రశ్న చాలా సహజం. "నేను ఏ పంట వేయాలి?" కంటే ముందు "ఏ పంట వేస్తే నాకు స్థిరమైన ఆదాయం వస్తుంది?" పంట మార్చుమని చెప్పడం సులభం. కానీ ఆ పంటకు మార్కెట్ కల్పించడం, ధరకు భరోసా ఇవ్వడం, కొనుగోలు వ్యవస్థ ఏర్పాటు చేయడం ప్రభుత్వాల అసలు బాధ్యత.

**చెరుకు నుంచి ఇథనాల్ వరకు..**
చెరుకు కేవలం చక్కెర తయారీకి మాత్రమే కాదు. ఇథనాల్ తయారీలోనూ కీలకమైన ముడి పదార్థం. పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ద్వారా చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, దేశ ఇంధన భద్రతను పెంచడం, రైతులకు ప్రత్యామ్నాయ మార్కెట్ కల్పించడం కేంద్రం లక్ష్యాల్లో ఉన్నాయి. అయితే చక్కెర ధరలు పెరిగిన ప్రతిసారీ "చెరుకును ఇథనాల్ వైపు మళ్లించడం వల్లే చక్కెర కొరత వచ్చిందా?" అనే ప్రశ్న ముందుకొస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రస్తుత ధరల పెరుగుదలను ఇథనాల్ కోసం చెరుకు మళ్లింపుతోనే అనుసంధానించడం సరికాదని స్పష్టం చేసింది. ఉత్పత్తి తగ్గుదల ఇతర మార్కెట్, వాతావరణ పరిస్థితులే ప్రధాన అంశాలని పేర్కొంది. కాబట్టి ఇథనాల్‌ను మొత్తం సమస్యకు కారణంగా చూపడం సరైంది కాదు. అదే సమయంలో ఆహార అవసరాలు, ఇంధన అవసరాలు, రైతు ఆదాయం.. ఈ మూడింటి మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్నది మాత్రం విధాన నిర్ణేతలు ఆలోచించాల్సిన అంశం.

**రైతుకు వరి వద్దంటే.. ప్రత్యామ్నాయం ఏది?**
తెలంగాణలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాలు చెబుతున్నాయి. పర్యావరణం, భూగర్భజలాలు, నీటి వనరుల పరిరక్షణ పరంగా ఇది అవసరమే కావచ్చు. కానీ రైతు లెక్క వేరుగా ఉంటుంది. వరి వేస్తే కొనుగోలు కేంద్రం ఉంది. మార్కెట్ ఉంది. కనీసం పంటకు ఒక పరిచితమైన వ్యవస్థ ఉంది. ప్రత్యామ్నాయ పంట వేయాలంటే మార్కెట్ ఎక్కడ? కొనేవారు ఎవరు? ధర ఎంత? పంట చేతికి వచ్చిన తర్వాత ఎక్కడ అమ్మాలి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు లేకుండా పంట మార్పు సాధ్యం కాదు. రైతు పంటను మార్చాలంటే ముందు మార్కెట్‌ను మార్చాలి. చెరుకు సాగును తిరిగి పెంచాలనుకుంటే చక్కెర కర్మాగారాల పరిస్థితి మెరుగుపడాలి. రైతుకు సమయానికి చెల్లింపులు రావాలి. ఇథనాల్ ద్వారా వచ్చే అదనపు మార్కెట్ ప్రయోజనం రైతుకు చేరాలి. నీటి వినియోగం, పంట దిగుబడి, ధర.. అన్నింటినీ సమన్వయం చేసే ప్రణాళిక ఉండాలి.

**దిగుమతులు.. తాత్కాలిక ఉపశమనమేనా?**
ధరలను అదుపులోకి తీసుకురావడానికి 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడం తక్షణ చర్యగా ఉపయోగపడొచ్చు. అయితే దిగుమతులకు అక్టోబర్ 31 వరకు మాత్రమే అనుమతి ఉంది.

**ఎగుమతుల దేశం.. దిగుమతుల దిశ ఎందుకు?**
ఇది ఒక్క ఏడాది సమస్య కాదు. చక్కెర రంగంలో ఉత్పత్తి, వినియోగం, నిల్వలు, ఎగుమతులు, ఇథనాల్, రైతు ఆదాయం.. అన్నీ పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. ఒకప్పుడు ఉత్పత్తి అధికంగా ఉంటే ఎగుమతులు చేశాం. ఇప్పుడు నిల్వలు, సరఫరాపై ఒత్తిడి కనిపించడంతో దిగుమతుల వైపు చూస్తున్నాం. తాజా పరిణామం దాదాపు దశాబ్దం తర్వాత భారత్ మళ్లీ ముడి చక్కెర దిగుమతులకు తలుపులు తెరవడం కావడం విధానపరంగా ఆలోచించాల్సిన విషయమే. దిగుమతి చేయడం తప్పు కాదు. అవసరమైనప్పుడు దిగుమతి చేసుకుని వినియోగదారుడిని రక్షించడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ప్రతి పండుగ సీజన్‌లో ఇదే పరిస్థితి రాకుండా చేయడమే అసలు విధాన విజయం. తీపి కోసం సమన్వయ విధానం కావాలి. చక్కెర ధర తగ్గాలంటే కేవలం మార్కెట్‌లో ధరను నియంత్రించడం సరిపోదు. పొలంలో చెరుకు సాగు నిలబడాలి. రైతుకు గిట్టుబాటు రావాలి. మిల్లులు సమర్థంగా పనిచేయాలి. చక్కెర ఉత్పత్తి, ఇథనాల్ అవసరాలు సమన్వయంతో ఉండాలి. వాతావరణ మార్పులను ముందుగానే అంచనా వేసి ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలి. పండుగల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు నిల్వలు, సరఫరా వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. అదే సమయంలో మార్కెట్‌లో కృత్రిమ కొరత, అధిక నిల్వలు, ఊహాగానాలపై కఠిన పర్యవేక్షణ అవసరం. దేశంలో పండుగల డిమాండ్‌ను తట్టుకునేంత నిల్వలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్న నేపథ్యంలో వినియోగదారుడికి చేరే సరికి ధర ఎందుకు అంతగా పెరుగుతోంది? అన్నదానిపై కూడా స్పష్టత రావాలి. చక్కెర కిలో రూ.70--75కు చేరడం ఒక కుటుంబానికి చిన్న విషయం అనిపించొచ్చు. కానీ చక్కెరతో పాటు పాలు, నూనె, పప్పులు, కూరగాయలు, విద్య, వైద్యం, ఇంధనం.. ప్రతి ఖర్చు పెరిగితే అదే మధ్యతరగతి కుటుంబానికి పెద్ద భారమవుతుంది. వంటింట్లో తీపి తగ్గడం వెనుక పొలంలో రైతు ఎదుర్కొంటున్న చేదు కూడా కనిపించాలి. రైతుకు లాభం ఉండాలి. వినియోగదారుడికి అందుబాటు ధర ఉండాలి. దేశానికి తగినంత చక్కెర ఉండాలి. ఇంధన అవసరాలకు ఇథనాల్ అందాలి. నీటి వనరులు కాపాడాలి.

**ఈ ఐదింటినీ సమన్వయం చేసే విధానం అవసరం. లేకపోతే ఈరోజు చక్కెర.. రేపు మరో పంట.
పంట పండించే రైతు నిర్ణయం మార్కెట్ బలవంతం చేయకూడదు. ప్రభుత్వం ఇచ్చే విధానం రైతుకు భరోసా ఇవ్వాలి. అప్పుడు మాత్రమే పంటలో తీపి ఉంటుంది.. మార్కెట్‌లో స్థిరత్వం ఉంటుంది.. వినియోగదారుడి వంటింట్లో నిజమైన తీపి ఉంటుంది.**

**చీకోటి సాయి మణికంఠ
మేనేజింగ్ ఎడిటర్
నవజ్యోతి తెలుగు డైలీ**

---



## నానో ఎరువులపై రైతులకు వ్యవసాయ అధికారుల అవగాహన

**మాడ్గులపల్లి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
మండలంలోని కొయల్‌పాడు, గుర్రప్పగూడెం గ్రామాల్లో ఆత్మ ఆధ్వర్యంలో రైతు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నానో యూరియా, నానో డీఏపీ వినియోగ విధానం, ప్రయోజనాలు, సమీకృత తెగులు నిర్వహణపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీ ద్రవరూపంలో లభించే ఆధునిక నానో ఎరువులని అధికారులు తెలిపారు. పంట అవసరాన్ని బట్టి సిఫారసు చేసిన మోతాదులో నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు అవసరమైన పోషకాలను అందించవచ్చని వివరించారు. పంట ఎదుగుదల దశలో, అలాగే పూత, పిందె దశల్లో ఆకుల పైభాగంతో పాటు క్రింది భాగం కూడా తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. నానో ఎరువుల వినియోగంతో పోషకాలను సమర్థవంతంగా అందించడంతో పాటు ఎరువుల రవాణా, నిల్వలో సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు సిఫారసు చేసిన మోతాదులోనే వీటిని వినియోగించాలని సూచించారు. అలాగే సమీకృత తెగులు నిర్వహణలో రసాయన పురుగుమందులపై పూర్తిగా ఆధారపడకుండా జీవ, యాంత్రిక, సాంస్కృతిక తదితర పద్ధతులను సమన్వయం చేసుకుని తెగుళ్లను నియంత్రించవచ్చని అధికారులు వివరించారు. దీని ద్వారా పురుగుమందుల వినియోగం, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, మిత్ర పురుగుల సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. పురుగుమందులకు తెగుళ్లు నిరోధకత పెంపొందించుకోకుండా నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పందిరి మారయ్య, వ్యవసాయ అధికారి ఎం. శివరాం కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి నితిన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ఆసరా



**కూకట్‌పల్లి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్ డివిజన్‌కు చెందిన లబ్ధిదారుడు బతాళ నాగరాజుకు రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాన్ని అందజేశారు. ఆర్థిక స్థోమత లేక కార్పొరేట్ వైద్యం పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సకాలంలో ఆర్థిక సాయం అందించినందుకు బతాళ నాగరాజు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతాంగం, మైనారిటీల సంక్షేమమే ధ్యేయం

**పెద్దపల్లి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రైతులు, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్‌లో రూ.1.39 కోట్ల నిధులతో నిర్మించనున్న డ్రైన్ ప్లాట్‌ఫామ్, నూతన మరుగుదొడ్ల నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతుల నుంచి ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించామని పేర్కొన్నారు.



**మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు**
అనంతరం ఎంబీ గార్డెన్స్‌లో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మహమ్మద్ ఒబైదుల్లా కోత్వాల్‌తో కలిసి ఇందిరా మహిళా శక్తి పథకం కింద మైనారిటీ సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. 600 మంది మైనారిటీ మహిళలకు రూ.72 లక్షల విలువైన కుట్టు మిషన్లు, 60 మంది కాశ ముస్లిం లబ్ధిదారులకు రూ.36 లక్షల సబ్సిడీతో రాతి కటింగ్ యంత్రాలు పంపిణీ చేశారు.

**మైనారిటీలకు శ్మశానవాటిక, షాదీఖానా**
రాఘవాపూర్‌లో మైనారిటీల శ్మశానవాటిక కోసం రెండు ఎకరాల భూమితో పాటు రూ.10 లక్షల నిధులు కేటాయించినట్లు విజయరమణ రావు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోనూ మైనారిటీల శ్మశానవాటికకు స్థలం కేటాయించినట్లు చెప్పారు. త్వరలో షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సింగిల్ విండో చైర్మన్లు, నాయకులు, రైతులు, మైనారిటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మ్యాన్‌హోల్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**కూకట్‌పల్లి , ఆగస్టు 25 ( నవజ్యోతి ప్రతినిధి) :**
ప్రజా సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని వినాయక నగర్ గడ్డిచేను సర్కిల్ వద్ద భారీ వాహనాల రాకపోకలతో టర్నింగ్‌లోని సిమెంట్ మ్యాన్‌హోల్ మూతలు తరచూ దెబ్బతింటున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన రవీందర్ రెడ్డి అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపించారు. భవిష్యత్తులో మూతలు పాడవకుండా ఉండేందుకు కొత్తగా ఐరన్ క్యాచ్ పిట్‌ను ఏర్పాటు చేయించారు.




స్థానికుల భద్రత దృష్ట్యా సమస్యను త్వరితగతిన పరిష్కరించడం పట్ల స్థానిక కాలనీవాసులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

## హేమ దుర్గా మాత ఆలయ వార్షికోత్సవం



**కూకట్‌పల్లి , ఆగస్టు 25 ( నవజ్యోతి ప్రతినిధి):**
అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ ఆకాంక్షించారు. మియాపూర్‌లో వెలసిన హేమ దుర్గా మాత ఆలయ 26వ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బండి రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమంలో దంపతులు స్వయంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికే వార్డు సమీక్షలు

**కూకట్‌పల్లి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తామని పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. పెండింగ్ అభివృద్ధి పనుల్లో అలసత్వాన్ని వీడి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హఫీజ్‌పేట్ డివిజన్ మైత్రీనగర్ పార్కులో జరిగిన 'వన్ డే వన్ వార్డు' కార్యక్రమంలో కమిషనర్ సృజనతో కలిసి స్థానిక సమస్యలపై ఆయన సమీక్షించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాల కల్పనకు చర్యలు చేపట్టాలని, నాలాల విస్తరణ పనులు పూర్తిచేయాలని కమిషనర్‌ను కోరారు. పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలెంపాటి, డీసీ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధిపై పురపాలక సాధారణ సమావేశంలో విస్తృత చర్చ




**మిర్యాలగూడ, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):**
పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనపై పురపాలక కార్యాలయంలో నిర్వహించిన పురపాలక సాధారణ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పురపాలక చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, ఉపాధ్యక్షురాలు గుడిపాటి శిరీష నవీన్, పురపాలక కమిషనర్ శ్రీజా రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే బీఎల్ఆర్ కౌన్సిలర్లు, పురపాలక అధికారులు, ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. పట్టణంలోని మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, రహదారుల అభివృద్ధి, మురుగునీటి కాలువల సమస్యల పరిష్కారం తదితర ప్రజా అవసరాలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి, వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మిర్యాలగూడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, పట్టణాన్ని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పురపాలక కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భిక్కనూరు మండలంలో ఘనంగా వన మహోత్సవం



భిక్కనూరు, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): భిక్కనూరు మండలంలోని పలు గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.మోటటిపల్లి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ గంధం భూమయ్య కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యుడు భాస్కర్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి సుష్మ పాల్గొన్నారు.పెద్ద మల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీ రామ్మోహన్‌రావు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బాలగౌడ్, సీఈవో మోహన్‌గౌడ్, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోనూ మొక్కలు నాటారు. మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు సూచించారు.

## తిప్పాపూర్ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిని నియమించాలి



భిక్కనూరు, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): తిప్పాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మూడు నెలలుగా ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ భిక్కనూరు ఎంఈఓ రాజ గంగారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిని త్వరగా నియమించాలని కోరగా, సమస్యపై స్పందించిన ఎంఈఓ త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రాష్ట్ర అధ్యక్షుడి దీక్షకు మద్దతుగా కామారెడ్డి బీజేపీ నేతల తరలింపు



కామారెడ్డి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా కామారెడ్డి పట్టణ బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి' పేరుతో చేపట్టిన దీక్షకు యువత నుంచి మద్దతు లభిస్తోందని నాయకులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణ బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లినట్లు తెలిపారు.

## సింగీతం రిజర్వాయర్‌కు భారీగా వరద



జుక్కల్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): గత రాత్రి కురిసిన భారీ వర్షాలతో సింగీతం రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 975 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు.వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని మూడు గేట్లను ఎత్తి 975 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువలోకి మళ్లిస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ సాకేత్ తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రిజర్వాయర్ నీటి ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# కామారెడ్డి నియోజకవర్గంలో పలువురు పీఏసీఎస్ చైర్మన్ల నియామకం





*** నూతన చైర్మన్లకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శుభాకాంక్షలు**

, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)కు నూతన చైర్మన్లను నియమించారు. బిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, అంతంపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా చిట్టేడి సుధాకర్‌రెడ్డి, దోమకొండ పీఏసీఎస్ చైర్మన్‌గా అనంతరెడ్డి, మాచారెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ నియమితులయ్యారు. నూతన చైర్మన్లు మంగళవారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ వారికి శుభాకాంక్షలు తెలియజేసి రైతుల సంక్షేమం, సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.రైతులకు ప్రభుత్వ పథకాలు, రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర సేవలు పారదర్శకంగా అందేలా చూడాలని, చిన్న, సన్నకారు రైతులకు ప్రత్యేకంగా ప్రభుత్వ సహకారం అందేలా చొరవ తీసుకోవాలని అన్నారు. పీఏసీఎస్‌లు రైతుల ఆర్థికాభివృద్ధికి, వ్యవసాయ రంగ బలోపేతానికి కీలక కేంద్రాలుగా పనిచేయాలని సూచించారు.సహకార సంఘాల కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ రైతుల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం నూతన చైర్మన్లను షబ్బీర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని చైర్మన్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాత రాజు, ఆశపోయిన శ్రీనివాస్, నాగన్నగారి నరేందర్‌రెడ్డి, బల్యాల సుదర్శన్, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, సుతారి రమేష్, గణేష్ నాయక్, శ్యామ్‌రెడ్డి, బాగా రెడ్డి, సర్పంచులు, ఐరన్ నరసయ్య, సంతోష్‌రెడ్డి, మధు, సలీం, సంజీవరెడ్డి, పాముల లింబాద్రి, దయాకర్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, బన్సీలాల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పాఠశాలను సందర్శించిన డీఈఓ



కామారెడ్డి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): చిన్న మల్లారెడ్డిలోని పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామ్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ప్రార్థనా సమయంలో పాఠశాలకు చేరుకున్న అధికారులు విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన, సృజనాత్మక విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.అనంతరం సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన అధికారులు ప్రయోగ పరికరాల వినియోగం, విద్యార్థులకు ప్రయోగాత్మకంగా సైన్స్ బోధిస్తున్న తీరును తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించి ఆసక్తి పెంచేలా నాణ్యమైన బోధన అందించాలని సూచించారు.వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయి రెడ్డి, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, గోపాల్, ప్రభాకర్, సుశీల, రాజ్యలక్ష్మి, సీఆర్‌పీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు



కామారెడ్డి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో సామాజిక న్యాయ యోధుడు బీపీ మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.నాయకులు మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం బీపీ మండల్ జీవితాంతం కృషి చేశారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మండల్ కమిషన్‌కు ఆయన అధ్యక్షత వహించారని పేర్కొన్నారు.వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు మండల్ కమిషన్ కీలక సిఫారసులు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న సిఫారసు సామాజిక న్యాయ చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచిందని తెలిపారు.బీపీ మండల్ ఆశయాలను కొనసాగిస్తూ విద్యను ఆయుధంగా చేసుకుని సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో అభివృద్ధి, సమాన అవకాశాలతో సామాజిక న్యాయం, ఐక్యతతో బీసీల అభ్యున్నతి సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాప శివరాములు, ప్రధాన కార్యదర్శి దయాకర్, పూల్‌సింగ్, ప్రవీణ్, రమేష్, వీరేశం, రాజేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.<

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



భిక్కనూరు, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ భిక్కనూరు మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులు విద్యా సంవత్సరం పూర్తి చేసినా ఫీజు బకాయిలు అందకపోవడంతో కొన్ని కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి' కార్యక్రమాన్ని గ్రామగ్రామాన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు అండగా బీజేపీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్, ప్రధాన కార్యదర్శి పొన్నాల రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షులు నాగర్తి నరేందర్‌రెడ్డి, అరిగె నర్సింలు, లక్ష్మిదేవిపల్లి సర్పంచ్ జే. లింగారెడ్డి, జిల్లా నాయకులు వల్లకొండ రవీందర్‌రెడ్డి, సుధాకర్, బలరామరెడ్డి, వివిధ గ్రామ అధ్యక్షులు బల్ల బాల్‌లింగం, అంజాంరెడ్డి, బొందుగుల భాస్కర్, గంధం రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మహిపాల్, విలాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధనకు ఆశా కార్యకర్తల ధర్నా




హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి. రాజగోపాల్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లోని మెడికల్ కౌన్సిల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.ఆశా కార్యకర్తలకు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎంసీ టార్గెట్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీఎల్ఓ విధుల నుంచి ఆశా కార్యకర్తలకు మినహాయింపు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలన్నింటినీ వారికి వర్తింపజేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గచ్చిబౌలిలో చిన్నారుల కిడ్నాప్‌నకు యత్నం

*** ఘటనా స్థలంలోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు**



హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి. రాజగోపాల్): గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు చిన్నారులను కిడ్నాప్ చేసేందుకు జరిగిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. నిందితుడు సోరెన్‌ను ఘటకేసర్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని, చిన్నారులను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.రాఘవ ప్రాజెక్ట్స్ లేబర్ క్యాంప్‌లో నివసించే ప్రమీల, సంగీత అనే చిన్నారులను వారి తండ్రి సహోద్యోగి సోరెన్ షాపునకు తీసుకెళ్తానని చెప్పి బయటకు తీసుకెళ్లాడు. ఎంతసేపటికీ పిల్లలు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టి సోరెన్ కదలికలను గుర్తించారు. ఘటకేసర్ రైల్వే స్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకుని, చిన్నారులను రక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌పై సస్పెన్షన్



హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి. రాజగోపాల్): జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై పోలీస్ కమిషనర్ ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంలో సీఐ ముత్తు యాదవ్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. సుమంత్‌పై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం చేయడంతో పాటు, నిందితుడిని పట్టుకోవడంలో అలసత్వం వహించినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.ముత్తు యాదవ్ మూడు వారాల క్రితమే జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే కీలక కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# పోలీసు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ

**✻ బాధితులకు 142 సెల్‌ఫోన్లు అందజేత**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం పోలీసు డ్రైవర్లకు ప్రత్యేక పునశ్చరణ శిక్షణతో పాటు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన 142 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కమిషనరేట్ సమావేశ మందిరంలో పోలీసు డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణలో సీపీ మాట్లాడుతూ డ్రైవర్ల అప్రమత్తత, క్రమశిక్షణపై అధికారులు, సిబ్బంది భద్రత ఆధారపడి ఉంటుందన్నారు. ఒత్తిడి, కోపం, అనారోగ్య పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వేగాన్ని నియంత్రించాలని సూచించారు. పోలీసు వాహనాల సాంకేతిక స్థితి, పరిశుభ్రతను కాపాడుకోవడంతో పాటు విధి నిర్వహణలో గోప్యత పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా, సమర్థంగా స్పందించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. వీఐపీ కాన్వాయ్‌లో ప్రమాదాన్ని నివారించిన డ్రైవర్ శ్రీనివాస్‌ను సీపీ అభినందించారు.

**రూ.27.40 లక్షల విలువైన ఫోన్లు..**

అనంతరం సీసీఎస్, ఐటీ సెల్ బృందాలు నిర్వహించిన సెల్‌ఫోన్ రికవరీ మేళాలో రూ.27.40 లక్షల విలువైన 142 సెల్‌ఫోన్లను బాధితులకు సీపీ అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.సీఈఐఆర్ ద్వారా బ్లాక్ చేసిన ఫోన్లు ఇతర నెట్‌వర్క్‌లలో పనిచేయకుండా చేయడంతో వాటి అక్రమ వినియోగాన్ని అడ్డుకోవచ్చని తెలిపారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 3,717 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు సీపీ వెల్లడించారు.కార్యక్రమాల్లో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, రమేష్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్‌కుమార్, వై. కృష్ణారెడ్డి, టి. గోపి, పి. బాలాజీ వరప్రసాద్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.









## వెల్దుర్తిలో ఘనంగా 18వ మహిళా సమైక్య మహాసభ



వెల్దుర్తి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): వెల్దుర్తి మండల కేంద్రంలో 18వ వార్షిక మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. వెల్దుర్తి మండల మహిళా పరస్పర సహాయ సహకార పరపతి సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం, సెర్ప్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారని, మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు.శేరిలా గ్రామంలో మహిళా సమైక్య భవనం సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ విజయలక్ష్మిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో విఘ్నేశ్వర్, సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రావణ్, ఏపీఎం సుభాష్‌గౌడ్, సీసీ లక్ష్మణ్, అధ్యక్షురాలు రూప, కార్యదర్శి భాగ్యరాణి, కోశాధికారి నర్సమ్మ, వీఓఏలు అశోక్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఊరేగింపు మార్గంలో పోలీసు నిఘా

**✻ బందోబస్తుపై డీసీపీ కోటిరెడ్డి ఫోకస్**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): మిలాద్–ఉన్–నబీ ఊరేగింపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి, బాలానగర్ ఏసీపీ గంగిరెడ్డితో కలిసి జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఊరేగింపు నిర్వాహకులు, ముస్లిం కమ్యూనిటీ పెద్దలతో సమావేశమయ్యారు.ఊరేగింపు మార్గం, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం డీసీపీ స్వయంగా ఊరేగింపు మార్గాన్ని పరిశీలించి రద్దీ ప్రాంతాలు, కీలక ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.ఊరేగింపు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీసీపీ కోటిరెడ్డి ఆదేశించారు. జగద్గిరిగుట్ట ఎస్‌హెచ్‌ఓ సురేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డి. పోచంపల్లిలో అక్రమ నిర్మాణంపై కొరడా

**✻ 100 గజాల్లో జీ+4 నిర్మాణం కూల్చివేత..**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): దుండిగల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. దొమ్మరపోచంపల్లి పరిధిలోని సర్వే నంబర్ 168లో కేవలం 100 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన జీ+4 భవనాన్ని మంగళవారం కూల్చివేశారు. అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు, నిర్మాణాలు చేపడుతున్న వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మనీకరణ్ తెలిపారు. తక్కువ విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని చెప్పారు.అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలను ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించే భవనాలపై కూల్చివేత చర్యలు కొనసాగుతాయని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కూల్చివేతలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు

**– 11 మంది నకిలీ డాక్టర్ల అరెస్ట్**



హైదరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి. రాజగోపాల్): నగరంలో నకిలీ డాక్టర్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. సికింద్రాబాద్, జూబ్లీహిల్స్ జోన్ల పరిధిలో ఏకకాలంలో చేపట్టిన దాడుల్లో 11 మంది నకిలీ డాక్టర్లను అరెస్ట్ చేశారు. వారికి సహకరిస్తున్న ఓ మెడికల్ షాప్ నిర్వాహకుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు.ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తూ రోగులకు ఇంజెక్షన్లు, సెలైన్లు, మందులతో చికిత్స అందిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. నిందితుల వద్ద నుంచి నకిలీ వైద్య ధ్రువపత్రాలు, మందులు, వైద్య పరికరాలను స్వాధీనం చేసుకుని క్లినిక్‌లను సీజ్ చేశారు.నిందితులపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నకిలీ క్లినిక్‌లను గుర్తిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అర్హత కలిగిన వైద్యుల వద్దే చికిత్స పొందాలని సూచించారు.

## ప్రమాదాలపై 'బ్రేక్'.. ట్రాఫిక్ ఉల్లంఘనలపై 'చెక్'





కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): జీడిమెట్ల రహదారులపై ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ట్రాఫిక్–II డీసీపీ ఎస్. శేషాద్రిణి రెడ్డి, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన వార్షిక తనిఖీలో ట్రాఫిక్ నిర్వహణ, ఎన్‌ఫోర్స్‌మెంట్, రోడ్డు భద్రతపై సమీక్షించారు.పోలీస్‌స్టేషన్ రికార్డులు, ట్రాఫిక్ కిట్ సామగ్రి, ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను పరిశీలించిన డీసీపీ సిబ్బందితో మాట్లాడి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్ల వద్ద అవసరమైన రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.రోడ్డు నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాలు ఉంటే సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కఠినతరం చేసి, రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ లోని వాహనాల నిర్వహణ, శుభ్రత, ట్రాఫిక్ సామగ్రి వినియోగాన్ని కూడా డీసీపీ పరిశీలించారు. ఈ తనిఖీలో జీడిమెట్ల ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ వై. వెంకటేశ్వరరావు, సీఐ నరసింహారావు, ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణ

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (నవజ్యోతి) : (నవజ్యోతి ప్రతినిధి): పాలకుర్తి రైతు వేదికలో ఆగస్టు 27న



పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత ఆచరణాత్మక శిక్షణ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని చెప్పారు.పుట్టగొడుగుల సాగుకు అనుకూల వాతావరణం, స్పాన్, గడ్డి, ఊకతో సబ్‌స్ట్రేట్ తయారీ, సాగు పద్ధతులు, పంట సంరక్షణ, మార్కెటింగ్ తదితర అంశాలపై వ్యవసాయ విశ్వవిద్యాలయ నిపుణులు శిక్షణ ఇస్తారని తెలిపారు.రైతులతో పాటు మహిళా రైతులు, నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ముందస్తు నమోదు చేసుకున్న 25 మందికి మాత్రమే శిక్షణలో అవకాశం ఉంటుందని, పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఏఈఓ లేదా పాలకుర్తి రైతు వేదికను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ప్రభుత్వ సలహాదారుడిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆలయ అర్చకుడు



బిక్కనూరు, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూరు సిద్దరామేశ్వర ఆలయంలో నూతనంగా అర్చక బాధ్యతలు స్వీకరించిన నవీన్‌కుమార్ శర్మ మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ నవీన్‌కుమార్ శర్మకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నవీన్‌కుమార్ శర్మ షబ్బీర్ అలీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ లింబాద్రి, సభ్యులు దయాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, బిక్కనూరు గ్రామ ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, తిప్పాపూర్ పీఏసీఎస్ చైర్మన్ భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్

**✻ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి: ఫారెస్ట్ రేంజ్ అధికారి అంబర్ సింగ్...**



మనోహరాబాద్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి అంబర్ సింగ్ అన్నారు. మనోహరాబాద్ మండలం గౌరారం, రంగాయపల్లి గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా మంగళవారం సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అంబర్ సింగ్ మాట్లాడుతూ.. రెండు గ్రామాల్లో 2 వేల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పచ్చదనం పెంచడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా ప్రకృతి పరిరక్షణలో సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు.కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ విట్టల్‌రెడ్డి, నాయకులు పురం రవి, పాలకవర్గ సభ్యులు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నానో ఎరువులతో ఖర్చులు తగ్గించుకోవాలి



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): రైతులు నానో ఎరువులను వినియోగించి పంట దిగుబడులు పెంచుకోవడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని ఆకెనపల్లి గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి–సుధాకర్ సూచించారు. ఆత్మ (ఏటీఎంఏ) పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆకెనపల్లి గ్రామంలో నానో ఎరువుల వినియోగంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసక్తి ఉన్న రైతులకు సర్పంచ్ ఉచితంగా నానో ఎరువుల బాటిళ్లను పంపిణీ చేశారు. నానో సాంకేతికతతో రూపొందించిన ఎరువులను వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు భూసారాన్ని కాపాడుకోవచ్చని ఆమె తెలిపారు.వ్యవసాయ అధికారి సతీష్ మాట్లాడుతూ నానో ఎరువుల వినియోగం, ప్రయోజనాలు, పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటకు అవసరమైన పోషకాలను సమర్థంగా అందించడంలో నానో ఎరువులు ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చదనంపై అధికారుల ప్రత్యేక దృష్టి

**✻ ఉషోదయ కాలనీలో వనమహోత్సవం**




కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని ఉషోదయ కాలనీ పార్కులో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏసీ యూబీడీ సుభద్రాదేవి, ఐఎఫ్ఎస్, గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ యు. వెంకట్ రాములు పాల్గొని మొక్కలు నాటారు. కాలనీ పార్కుల్లో పచ్చదనం పెంచడంతో పాటు నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.లిటిల్ స్టార్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు వనమహోత్సవంలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్, డీడీ రమేష్, మేనేజర్ విజయరాణి, డీఈ నిఖిల్‌రెడ్డి, కాలనీ వాసులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాంగ్ రూట్‌లో వచ్చిన స్కూల్ బస్సు ఢీ .. యువకుడికి తీవ్ర గాయాలు




మేడ్చల్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): రాంగ్ రూట్‌లో వచ్చిన ప్రైవేట్ స్కూల్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది.ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని సైదోనిగడ్డ తండాకు చెందిన మునావత్ సాయి (కిషన్ కుమారుడు) ద్విచక్ర వాహనంపై మేడ్చల్ వైపు వెళ్తుండగా జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సు రాంగ్ రూట్‌లో వచ్చి అతని బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో సాయి తీవ్రంగా గాయపడ్డాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన సాయిని చికిత్స కోసం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన....**

ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు డ్రైవర్‌తో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వాయుపుత్ర కాలనీలో మురుగు సమస్యకు చెక్

**✻ పాడైన మెయిన్‌హోల్స్ స్థానంలో కొత్తవి**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): బహదూర్‌పల్లి 294వ డివిజన్ పరిధిలోని వాయుపుత్ర కాలనీలో నెలకొన్న మురుగు సమస్యకు పరిష్కారం లభించింది. పాడైన మెయిన్‌హోల్స్ నుంచి మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసనతో పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండటంతో కాలనీ వాసులు సమస్యను కాంగ్రెస్ నాయకుడు బొంగునూరి కిషోర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.సమస్యపై స్పందించిన కిషోర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టేలా చేశారు. పాడైన మెయిన్‌హోల్స్‌ను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చే సమస్య పరిష్కారమైంది.సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించిన కిషోర్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని కిషోర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాదు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



శివంపేట, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్): శివంపేట మండలం మద్దూర్ గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగింది. సర్పంచ్ సోమ కృష్ణవేణి అశోక్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.కొత్త స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులు సులభంగా పొందవచ్చని తెలిపారు. కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ ఖైదీల విడుదలకు 29న ఇందిరాపార్కు వద్ద ధర్నా

**✻ ఐక్యవేదిక పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ**



కీసర, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని, ఉపా చట్టం, జాతీయ దర్యాప్తు సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జవహర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాజకీయ, ఆదివాసీ, ప్రజా సంఘాల నేతలు, మేధావులపై నమోదు చేసిన ఉపా కేసులను ఎత్తివేయాలని, ప్రజా సమస్యలపై పోరాడిన రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులు, ముస్లిం మైనారిటీలపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, అక్రమ అరెస్టులకు గురైన మహిళా సంఘాల రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని కోరారు.ప్రశ్నించే జర్నలిస్టులు, న్యాయవాదులు, వైద్యులు, హక్కుల కార్యకర్తలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలపై నిర్బంధ చర్యలు చేపట్టడం అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధించడం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనన్నారు.జవహర్‌నగర్ రాంకీ చెత్త డంపింగ్‌యార్డు సమస్యపై 25 ఏళ్లుగా పోరాడుతున్న ప్రజా హక్కుల పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఇప్పటికీ కేసుల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై ఉద్యమించే వారిపై అణచివేత చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర రాష్ట్రాల జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీల విడుదలకు చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణకు చెందిన ఖైదీలు ఇతర రాష్ట్రాల జైళ్లలో ఉంటే వారి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ బిర్రు యాకస్వామి, సీపీఐ దర్శనం యాదగిరి, సీపీఎం శివన్నారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ గడ్డం సదానందం, ఐఎఫ్‌టీయూ పి.శివబాబు, ఏఐఎఫ్‌టీయూ వై.మల్లేష్, బహుజనసత్త బండకింది సింగరయ్య గౌడ్, టీయూసీఐ వి.ప్రవీణ్, ఏఐటీయూసీ అంబాల ఎల్లయ్య, సీఎంఎస్ అల్లూరి సావిత్రి, పీఓడబ్ల్యూ డి.స్వరూప, పీడీఎం చంద్రమౌళి, ప్రజానాట్యమండలి వెంకటారి, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపె సునీత, పీఓడబ్ల్యూ అరుణక్క, జయసుధ, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ టి.కాలేషా, టీవీఐవీ మబ్బుబాలు, తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ సురేందర్, రైతు స్వరాజ్య వేదిక నర్సింహ్మా, శ్రావణ్‌కుమార్, మాజీ పీడీఎస్‌యూ దర్గయ, జర్నలిస్ట్ కొన్నెవేణు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దోషికి శిక్ష పడకుండా కాపాడిన రంగన్న దర్యాప్తు

**ఉత్తమ దర్యాప్తు అవార్డు అందజేసిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి**

కుషాయిగూడ, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి):నేరస్తులను పట్టుకోవడంతో పాటు నిర్దోషులకు అన్యాయం జరగకుండా వాస్తవాలను వెలికితీయడం కూడా పోలీసుల బాధ్యతలో కీలకమని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ అన్నారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కురువ పూజారి రంగన్న చేపట్టిన సమగ్ర దర్యాప్తును అభినందిస్తూ ఆయనకు ఉత్తమ దర్యాప్తు అవార్డును అందజేశారు.ఓ బాలిక చేసిన ఆరోపణల నేపథ్యంలో కేసుతో సంబంధం లేని వ్యక్తిని నిందితుడిగా చిత్రీకరించే ప్రయత్నం జరిగినప్పటికీ, రంగన్న అనుమానాస్పద అంశాలను గుర్తించి లోతుగా దర్యాప్తు చేపట్టారని కమిషనర్ తెలిపారు. కుషాయిగూడ నుంచి చర్లపల్లి, నాగారం, రాంపల్లి చౌరస్తా, బండ్లగూడ మీదుగా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీసరగుట్ట వరకు ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించినట్లు చెప్పారు. సీసీ కెమెరాల ఆధారాలను పరిశీలించిన అనంతరం బాలిక ఆరోపణల్లో వాస్తవం లేదని గుర్తించి, నిర్దోషి అయిన వ్యక్తిని కేసు నుంచి కాపాడటంలో రంగన్న కీలకంగా వ్యవహరించారని సుమతి అభినందించారు. నేరస్తులకు శిక్ష పడేలా చూడటంతో పాటు నిర్దోషులకు శిక్ష పడకుండా చూడటమే నిష్పక్షపాత దర్యాప్తుకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. గతంలోనూ పలు కేసుల దర్యాప్తులో ఉన్నతాధికారులకు కీలకంగా సహకరించిన రంగన్న పలుమార్లు ప్రశంసలు అందుకున్నారని అధికారులు తెలిపారు. ఈ కేసులోనూ ఆధారాల ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేసి తన విధి పట్ల నిబద్ధతను చాటుకున్నారని పేర్కొన్నారు.అవార్డు అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రంగన్నను కమిషనర్ సుమతితో పాటు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.



# కమాన్‌పూర్‌లో వైభవంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**✻ గురువారం నుంచి లబ్ధిదారులందరికీ అందజేత**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, కమాన్‌పూర్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): మండల కేంద్రమైన కమాన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ చేతుల మీదుగా తొలి విడతలో పలువురు అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీ పరిధిలోని మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు గురువారం నుంచి పూర్తిస్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, జీపీఓ రాజేందర్, ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్, వార్డు సభ్యులు గుంజపడుగు నవీన్, పంజా సాయిరాం, పచ్చునూరి రాజ్‌కుమార్, మేరుగు కుమార్, రేషన్ డీలర్ శంకరమ్మ, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# జూలపల్లిలో ఉచిత కంటి పరీక్షలు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, కమాన్‌పూర్, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి): కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్పంచ్ పోల్‌దాసరి వనితా సాయికుమార్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారిని కంటి ఆసుపత్రికి తరలించారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, వార్డు సభ్యులు వేముల సత్యం, బొల్లంపల్లి సంతోష్ కుమార్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ సాధనలో బీపీ మండల్‌ది చారిత్రక పాత్ర



రామాయంపేట, ఆగస్టు 25 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): సామాజిక న్యాయం, సమానత్వం కోసం బీపీ మండల్ చేసిన కృషి చారిత్రకమని యాదవ సంఘం, బీసీ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం రామాయంపేటలో యాదవ సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీపీ మండల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు.బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు బీపీ మండల్ చేసిన పోరాటం దేశ చరిత్రలో కీలకమని నాయకులు పేర్కొన్నారు. సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**బీసీ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి**

బీపీ మండల్ ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు బీసీల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు కోరారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనకు ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని అన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారం, మద్దెల రమేష్, యాదవ సంఘం ప్రతినిధులు బసన్నపల్లి రాజు యాదవ్, బసన్నపల్లి మల్లేశం, మాచం దేవరాజు, డీజే శ్రీనివాసరావు, పుట్టి సందీప్, దేవ్వని రంజిత్, గుగులోత్ రవి, దాకి స్వామి, చింతల స్వామి, అల్లోక్ గుప్తా, బైరాం కుమార్, అనుమైన పోచయ్య యాదవ్, ఎల్లోగొల్ల రమేష్ యాదవ్, దొరగొల్ల దుర్గయ్య యాదవ్, అనుమైన మల్లయ్య యాదవ్, రాములు యాదవ్, శ్రీశైలం యాదవ్, బత్తుల రవి యాదవ్, దోనేటి గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.